సాక్షి ప్రకాశం
బుధవారం । 15 । అక్టోబర్ । 2025



ఒక్క పనిముట్టు..అందితే ఒట్టు

కూటమి ప్రభుత్వంలో రైతులకు అందాల్సిన వ్యవసాయ పరికరాలు ఇంత వరకు అందలేదు.

- IIలో..



అడవుల సంరక్షణకు ప్రాధాన్యం

అడవుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రాజాబాబు పేర్కొన్నారు. వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు.

- IIలో..



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన గిద్దలూరు టైగర్ ప్రాజెక్టు డీడీ



కలెక్టర్ రాజా బాబుకు మొక్క అందిస్తున్న గిద్దలూరు టైగర్ ప్రాజెక్టు డీడీ నీషా కుమారి

ఒంగోలు సబర్బన్: కలెక్టర్ పీ.రాజాబాబును గిద్దలూరు టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం కలిసిన ఆమె కలెక్టర్‌కు మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దరి అధికారుల మధ్య టైగర్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలు, నల్లమల ప్రాజెక్టులో పర్యాటక అభివృద్ధి అంశాలపై మాట్లాడారు.

గ్రానైట్ ఫ్యాక్టరీల సమ్మె విరమణ

చీమకుర్తి: గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సమ్మె విరమిస్తున్నట్టు ఫ్యాక్టరీల యజమానుల యూనియన్ ప్రతినిధులు ప్రకటించారు. గత 14 రోజుల నుంచి చేస్తున్న సమ్మెను విరమించి బుధవారం నుంచి ఫ్యాక్టరీలను తిరిగి నడపనున్నట్లు యజమానులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు విజయవాడలోని మైన్స్ మంత్రిని కలిశారు. గ్రానైట్ రాయల్టీ వసూళ్లలో ప్రైవేటు ఏజెన్సీ ఏఎంఆర్ కంపెనీ వారు ప్రభుత్వానికి చెల్లించే రాయల్టీకి రెట్టింపు డబ్బులు అనధికారికంగా ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సూచనల మేరకు మంగళవారం సమ్మెను విరమించాలని సంతనూతలపాడు, మార్కాపురం ఎమ్మెల్యేలు బీఎన్ విజయకుమార్, కందుల నారాయణరెడ్డి మంగళవారం చీమకుర్తిలోని ఒక ప్రైవేటు గెస్ట్ హౌస్‌లో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులతో సమావేశమయ్యారు. అనంతరం సమ్మెను విరమిస్తున్నట్టు ప్రకటించారు.

జిల్లాలో కొంత మంది పోలీసు అధికారుల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్‌రాజు వీటన్నింటిపై దృష్టిసారించినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే పొదిలి సీఐపై వేటు పడిందన్న ప్రచారం జరుగుతోంది. దీంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కొత్త పోలీస్ బాస్ ప్రక్షాళన చేసే దిశగా అడుగలు వేస్తారా అన్నది అన్ని వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

వేటుతో మొదలాయే.. ప్రక్షాళనకు వేళాయే!



- ఏడాదిన్నరగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న జిల్లా పోలీసులు
- సీఐ, ఎస్సైల వ్యవహారశైలిపై నివేదికలు తెప్పించుకొని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు
- మహిళల ఫిర్యాదుతోనే పొదిలి సీఐ వెంకటేశ్వర్లుపై వేటు వేసినట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం
- మరో సీఐపై కూడా వేటుకు రంగం సిద్ధం
- డ్రంక్ అండ్ డ్రైవ్ వసూళ్లపై సీరియస్
- ఎస్పీ సిబ్బందిపైనా ఫిర్యాదుల వెల్లువ
- జిల్లాలో భారీగా పోలీసు శాఖ ప్రక్షాళన

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు విమర్శలు వచ్చాయి. శాంతి భద్రతలను ఏమాత్రం పట్టించుకోకుండా గాలికొదిలేసినట్టు ఆరోపణలు వచ్చాయి. జిల్లాలోని పలు సర్కిల్ అధికారులపై, కింది స్థాయి సిబ్బంది అధికార పార్టీ నేతలు అండచూసుకుని రెచ్చిపోతున్నారని విమర్శలు ఉన్నాయి. గత నెల 14వ తేదీ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వి.హర్షవర్ధన్ రాజు తనదైన శైలిలో పోలీసు శాఖలో మార్పులు చేర్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పొదిలి సీఐ వెంకటేశ్వర్లును రేంజి వీఆర్‌కు పంపించడమే కాకుండా ఆఘమేఘాలపై కొత్త సీఐగా రాజేష్ బాధ్యతలను చేపట్టారు. ఇదే తరహాలో మరికొంత మందిపై వేటుపడనుందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవల ఒంగోలు రూరల్, తాలుకా పోలీసుస్టేషన్లకు కూతవేటు దూరంలో టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి అత్యంత దారుణంగా హత్యకు గురైన తర్వాత జరిగిన పరిణామాలతో అప్పటి తాలూకా సీఐపై మాత్రం వేటువేసి చేతులు దులుపుకున్నారు. దీనిపై అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఇక ట్రాఫిక్ విభాగంపై లెక్కలేనన్ని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే మరో కీలక అధికారి వ్యవహారంపై కూడా పలు రకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. దీంతో కొత్త బాస్ ఒంగోలు నగరంపై ప్రత్యేక దృష్టిసారించినట్టు తెలుస్తోంది. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లపై రహస్యంగా నివేదిక తెప్పించుకుంటున్నట్టు తెలిసింది.

మహిళల ఫిర్యాదుతోనే పొదిలి సీఐపై వేటు...

పొదిలి సీఐ వెంకటేశ్వర్లు మీద తొలి నుంచి అనేక ఆరోపణలు వస్తున్నాయి. అవినీతి అరోపణలు మాత్రమే కాకుండా ఆయన వ్యక్తిగత వ్యవహారశైలి గురించి పలు ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలు వన్ టౌన్ సీఐగా పనిచేసిన సమయంలో వ్యక్తిగత సమస్య మీద పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళను వేధించడంపై పత్రికలలో కథనాలు వచ్చాయి. మార్టూరు టోల్ ప్లాజా వద్ద ప్రజలంతా చూస్తుండగానే మహిళను కొట్టడం సంచలనం సృష్టించింది. తాజాగా పొదిలి సీఐగా ఉన్న ఆయన పోలీస్‌స్టేషన్‌కు వచ్చే మహిళలను వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధిత మహిళలు ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ..విషయాన్ని రేంజి ఐజీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో రాత్రికి రాత్రే ఆయన్ను వీఆర్‌కు పంపించడమే కాకుండా ఆయన స్థానంలో రాజేష్‌ను నియమించారు.

మరో సీఐపై కూడా వేటు...?

ఒంగోలు కేంద్రంగా పనిచేస్తున్న మరో సీఐపై కూడా ఇదే విధమైన ఫిర్యాదులొచ్చినట్టు సమాచారం. రెండు నెలల క్రితం సదరు సీఐ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న ఒక మహిళా ఉద్యోగిని తీసుకొని వైజాగ్ విహారయాత్రకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న గత ఎస్పీ దామోదర్ సీఐకు క్లాస్ పీకడమే కాకుండా సదరు మహిళా ఉద్యోగినిపై బదిలీ వేటు వేసినట్లు సమాచారం. ఇక గ్రానైట్ టిప్పర్లు, ఇసుక లారీల నుంచి సైతం భారీగా వసూలు చేస్తున్నారని ఆయనపై వస్తున్న ఆరోపణల విషయంలో కూడా ఎస్పీ సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం.

డ్రంక్ అండ్ డ్రైవ్ వ్యాపారంపై సీరియస్...

జిల్లా కేంద్రమైన ఒంగోలులో గత ఏడాదిన్నర కాలంగా ట్రాఫిక్ డీఎస్పీ లేకుండానే గడిచిపోయింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల విషయంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాల అసలు జరిమానా కంటే వారి వసూళ్లే అధికంగా ఉండేవని బాధితులు వాపోయారు. మోటారు బైకు దొరికితే అదనంగా రూ.10 వేలు, ఆటో, కార్లు వంటి వాహనాలు దొరికితే రూ.20 వేల వరకు వసూలు చేసేవారని ఆరోపణలు ఉన్నాయి.

కోర్టు నుంచి ఆదేశాలు వచ్చినా ..

జిల్లాలో కొందరు సీఐలు రాజకీయ నాయకులు మద్దతుతో రెచ్చిపోయినట్లు ఆరోపణలు వచ్చాయి. నగరంలోని ఒక ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే మహిళా ఉద్యోగినిని ఇద్దరు సహోద్యోగులు వేధిస్తున్నారన్న ఆరోపణలపై ఓ సీఐ కేసు నమోదు చేయకుండా తాత్సారం చేశారు. కోర్టు నుంచి ఆదేశాలు వచ్చినా బేఖాతరు చేయలేదని ఆ మహిళా ఉద్యోగి ఆరోపిస్తున్నారు. గత సోమవారం సదరు మహిళ ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ కేసు గురించి కూడా ఆయన సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఒక ఎస్ఐ తీరుపై కూడా ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

ఒంగోలు డెన్‌పై విమర్శల వెల్లువ...

నగరంలోని ఓ పోలీసు అధికారి అనధికార డెన్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడ ఏ నేరం జరిగినా డెన్‌కు తీసుకెళ్లి విచారణ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా సింగిల్ నెంబర్ లాటరీ, గంజాయి కేసుల పేరుతో ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ యువకులను తీసుకొచ్చి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కూడా ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్బీలో వారి సంగతేంటి...?

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్బీలో పనిచేస్తున్న కొంత మంది సిబ్బంది వ్యవహారశైలి మీద విపరీతమైన ఆరోపణలు వచ్చాయి. పోలీసు శాఖ ఉద్యోగులుగా కాకుండా అధికారపార్టీ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని వారిపై ఆరోపణలు ఉన్నాయి. వారు చక్రం తిప్పి జిల్లాలో పలువురు పోలీసు సిబ్బందిని అటాచ్‌మెంట్ చేయించడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా అధికారపార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపుగా జిల్లాలో పనిచేస్తున్న అత్యధిక శాతం సీఐలు, ఎస్సైల మీద అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు శాఖలో సమగ్రమైన మార్పు తీసుకురావాలంటే చాలామంది వేటు వేయాల్సి వస్తుందని, అది సాధ్యమయ్యే పనేనా అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

జనార్దనరావు వెనుక ప్రభుత్వ పెద్దలు?

- ఆఫ్రికా నుంచి విడుదల చేసిన వీడియోలో జోగి రమేష్ ప్రస్తావన ఎందుకు లేదు
- నకిలీ మద్యంపై రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా వైఎస్సార్ సీపీపై మోపడం దుర్మార్గం
- ముందురోజు సీఎం మాటలే జనార్దనరావు వీడియో ప్రసంగం
- జనార్దనరావు ఫోను గుట్టు తేల్చండి
- సీబీఐ దర్యాప్తునకు ఎందుకు భయపడుతున్నారు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు

ఒంగోలు సిటీ: కుటీర పరిశ్రమల్లా నకిలీ మద్యం తయారు చేస్తూ, ఆధారాలతో సహా బయటపడినప్పటి నుంచి దాన్ని ఎలాగైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంటించేందుకు టీడీపీ పెద్దలు చేస్తున్న కుట్రలు పరాకాష్టకు చేరాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు ధ్వజమెత్తారు. నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో వైఎస్సార్ సీపీ నాయకుడు జోగి రమేష్‌కు ప్రమేయం ఉందంటూ ఆ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన రావు ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దానిపై ఎల్లో మీడియా రెచ్చిపోతూ, నిన్న సాయంత్రం నుంచే ట్రోల్స్ చేస్తోందన్నారు. కేవలం వైఎస్సార్ సీపీపైనా, ఆ పార్టీ నాయకులపైనా కక్ష సాధింపులకు పాల్పడడం, కేసు నుంచి తాము బయటపడేందుకు డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా సీఎం చంద్రబాబు చేసిన కుట్ర అని దుయ్యబట్టారు. ''అసలు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న అద్దేపల్లి జనార్దనరావు వీడియో ఎలా రికార్డ్ చేశాడు? పైగా తన ఫోన్ పోయిందని చెప్పినట్లు ఎల్లో మీడియాలోనే వచ్చింది. అలాగే ఏ కేసులో నిందితుడైనా, ఇన్వెస్టిగేషన్ అధికారుల ముందు ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు నిలబడి, చేతులు కట్టుకుని వినమ్రతతో మాట్లాడతారు. కానీ నిన్న జనార్దనరావు లీక్ చేసిన వీడియోలో ఆయన చక్కగా చైర్‌లో కూర్చుని ఉన్నాడు. పక్క నుంచి ఆఫీసర్ ఎవరో ప్రామ్ట్ చేస్తున్నట్లుగా ఉంది. పైగా తను ఆఫ్రికా నుంచి వచ్చినప్పటి డ్రెస్‌తోనే ఉన్నాడు. మరి ఆ వీడియో ఎప్పుడు, ఎవరు, ఎవరి ఫోన్‌లో రికార్డు చేశారు? ఇదంతా చూస్తుంటే, ఒక పథకం ప్రకారం చేసిన కుట్ర మాదిరిగా కనిపించడం లేదా'' అని వరికూటి సూటిగా ప్రశ్నించారు. అలాగే ఆ వీడియోను మీడియాకు ఎవరు విడుదల చేశారు? అన్నది తేలాలన్నారు. ఈ కేసులో వాస్తవాలను కప్పిపుచ్చుతూ కొత్త కట్టుకథ వినిపించేందుకే ఆ వీడియో విడుదల చేశారన్నది స్పష్టమవుతోందని, పోలీసుల అదుపులో, జైలు అధికారుల రిమాండ్‌లో ఉన్న వ్యక్తి వీడియో లీకు కావడానికి బాధ్యత ఎవరిదని నిలదీశారు. జనార్దనరావు గత వారం ఆఫ్రికా నుంచి కూడా ఒక వీడియో రిలీజ్ చేశాడని, నకిలీ మద్యం తయారీలో పార్టీ, ప్రభుత్వ పెద్దల ప్రమేయం లేదని, తాము మాత్రమే ఆ పని చేశామని చెప్పుకొచ్చాడన్నారు. ఆ రోజే మరి నిజంగా జోగి రమేష్ పేరు ఎందుకు ప్రస్తావించలేదని, రమేష్ చెబితేనే తాను నకిలీ మద్యం తయారు చేసిన విషయాన్ని ఆ వీడియోలోనే ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. కేసులో ఏ–1 నిందితుడైన జనార్దనరావు చంద్రబాబుకు అంతటి సన్నిహితుడేనని, 2024 ఎన్నికల్లో తంబళ్లపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జయచంద్రారెడ్డికి చంద్రబాబు టికెట్ ఇచ్చినప్పుడు జనార్దనరావు అక్కడే ఉన్నాడన్నారు. బీఫాం ఇచ్చేటప్పుడు అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులే ఉంటారు. మరి జనార్దనరావు ఆ సమయంలో చంద్రబాబు, జయచంద్రారెడ్డిలతో ఉండటం దేనికి సంకేతమన్నారు. ఇన్ని ఆధారాలు కనిపిస్తున్నా జనార్దనరావుకు జోగి రమేష్ సన్నిహితుడన్న ప్రభుత్వ వాదన పూర్తిగా కట్టు కథన్నారు. నకిలీ మద్యం కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న వ్యక్తి ఓ కార్పొరేట్ పారిశ్రామికవేత్త తరహాలో దర్జాగా గన్నవరం విమానాశ్రయంలో దిగారు. ఆయన ధీమా వెనుక దన్ను ఎవరు? కేసు నుంచి బయటపడేస్తామని ముఖ్యనేత హామీ ఇచ్చిన ధీమాతోనే కదా ఆయన అంత దర్జాగా వచ్చారని ఆరోపించారు. అంత హడావుడిగా ఎందుకు ఆంధ్రప్రదేశ్ చేరుకున్నారు? వెంటనే వచ్చి తాము చెప్పినట్టుగా కట్టు కథలు చెప్పాలన్న ముఖ్యనేత ఆదేశించారన్నది నిజం కాదా అన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న జోగి రమేశ్‌కు ఆయన నిజంగానే సన్నిహితుడే అయితే ఇంత హడావుడిగా విదేశాల నుంచి వచ్చే ధైర్యం చేయలేరు కదా? అంటే జనార్దన్‌రావు వీడియో ద్వారా చెప్పిందంతా ప్రభుత్వ పెద్దలు అల్లిన కట్టు కథ అన్నది స్పష్టమవుతోందన్నారు. అసలు జనార్దనరావు ఫోను గుట్టు విప్పితే దీని వెనకాల ఉన్న బడా వ్యక్తుల జాతకాలు బయటకు వస్తాయన్నారు. ములకలచెరువులో నకిలీ మద్యం రాకెట్ బయటపడిన రోజు మీడియాతో మాట్లాడిన ఎక్సైజ్ అధికారులు, అక్కడ ఈ ఏడాది మే, జూన్ నుంచి నకిలీ మద్యం తయారు చేస్తున్నారని చెప్పారన్నారు. ఇప్పుడు జనార్దనరావు తన వీడియోలో గత ప్రభుత్వ హయాం నుంచి జోగి రమేష్ చెప్పడం వల్లనే నకిలీ మద్యం తయారు చేశానని చెబుతున్నారని, దానికి, దీనికి లింక్ కుదరడం లేదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు

బాబు మాటలే జనార్దనరావు వీడియో..

జనార్దనరావు వీడియో సోమవారం సాయంత్రం విడుదల కాగా, అందులోని విషయాలపై ముందురోజు రాత్రే.. అంటే ఆదివారం రాత్రి మీడియాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు సూచనప్రాయంగా వివరాలు ఎలా వెల్లడించారు? అంటే ఆ వీడియో విడుదల కానుందని, అందులో ఏం మాట్లాడారన్న సమాచారం ఒక రోజు ముందుగానే ఆయనకు తెలుసా అని ప్రశ్నించారు. నకిలీ మద్యం కేసులో వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రమేయం ఉందని చంద్రబాబు ఆదివారం రాత్రి చెప్పిన విషయాలే.. సోమవారం విడుదలైన జనార్దన్‌రావు వీడియోలోనూ ఉండటం వెనుక లోగుట్టు ఏమిటన్నారు. ఇవన్నీ చూస్తుంటే.. ఇదంతా ఒక పక్కా వ్యూహం ప్రకారం విపక్ష వైఎస్సార్ సీపీపై బురద చల్లుతూ, తాము ఈ కేసు నుంచి బయట పడేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వ పెద్దలు చేస్తున్న కుట్రన్నారు.. ఒక్క మాటలో చెప్పాల్సి వస్తే ఒంటే.. పెదబాబు, చినబాబు చేసిన కుట్ర, కుతంత్రం ఇదంతా? అది నిజం కాదని చెప్పే ధైర్యం ఆ ఇద్దరికీ ఉందా? అని ప్రశ్నించారు.

జయచంద్రారెడ్డిని ఎందుకు తీసుకురావడం లేదు..

ములకలచెరువు నకిలీ మద్యం మాఫియాలో కీలక పాత్రధారిగా ఉన్న టీడీపీ నేత జయచంద్రారెడ్డిని విదేశాల నుంచి రప్పించేందుకు పోలీసులు ఎందుకు ప్రయత్నించడం లేదు? ఆయనపై ఎందుకు ఇంకా లుక్ అవుట్ నోటీసు జారీ చేయడం లేదని వరికూటి ప్రశ్నించారు. ఆయన రాష్ట్రానికి వస్తే తమ దందా బయటపడుతుందని ప్రభుత్వ పెద్దలు భయపడుతున్నారని నిలదీశారు. నకిలీ మద్యం బయటపడగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారన్నారు. అసలు ఆ నకిలీ అన్నది ఒక ప్రాంతానికే పరిమితం అన్నట్టు నమ్మించేందుకు యత్నించారన్నారు. మరి ఇప్పుడు ఎందుకు రాష్ట్రవ్యాప్తంగా మద్యం నాణ్యత తనిఖీకి ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టారు? అంటే నకిలీ మద్యం రాష్ట్రమంతా విస్తరించిందని ఒప్పుకున్నట్లే కదా అని ప్రశ్నించారు. నిజంగా జోగి రమేష్ చెబితేనే జనార్దనరావు నకిలీ మద్యం తయారు చేస్తే.. తాను జయచంద్రారెడ్డికి చెందిన వాహనంలోనే ఆ మద్యాన్ని రవాణా చేశానని జయచంద్రారెడ్డి డ్రైవర్ చెప్పారు. మరి అక్కడ కూడా జోగి రమేష్ చెబితేనే ఆ రవాణా జరిగిందా? అని నిలదీశారు. వైఎస్సార్ సీపీ డిమాండ్ చేస్తున్నట్లు నకిలీ మద్యం కేసుపై సీబీఐ దర్యాప్తు ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని అన్ని వైన్‌షాప్‌లు, పర్మిట్‌రూమ్‌లు, బార్లు, బెల్టు షాప్‌ల్లో తనిఖీలు ఎందుకు చేయడం లేదు? ఏది అసలు మద్యం? ఏది నకిలీ అనేది గుర్తించే ప్రయత్నం ఎందుకు చేయడం లేదని నిలదీశారు.

ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలి

- కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని డ్వామా అధికారులను కలెక్టర్ పీ.రాజా బాబు ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ డ్వామా అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జల స్థాయి పెరిగేలా చెక్ డ్యామ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు, చెరువులు, ఫీడర్ చానల్స్ పూడిక తీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా అమలవుతున్న ఫారం పాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు, ఫీడర్ ఛానల్స్, సప్లై ఛానల్స్ పూడికతీత పనులు, అమృత్ సరోవర్ పనులు, రోడ్డు ఫార్మేషన్, హార్టికల్చర్, ట్రెంచ్ వర్క్స్, బౌండరీస్ తదితర పనులకు సంబంధించిన అంశాలపై క్లస్టర్ల వారీగా సమీక్షించారు. వివిధ కార్యక్రమాల నిర్దేశిత లక్ష్యాలను, సాధించిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ వివరించారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ఒక కోటి 11 లక్షల పనిదినాలు కల్పన లక్ష్యం కాగా, ఇప్పటి వరకు ఒక కోటి 1 లక్ష పనిదినాలు కల్పించినట్లు చెప్పారు. జిల్లాలో భూగర్భ జల స్థాయి పెరిగేలా ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచేలా అధికారులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

ఏకేయూలో బీఎడ్ పరీక్షల నిర్వహణ



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న సీఈ సోమశేఖర

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ పరిధిలోని బీఎడ్ 2వ సంవత్సరం మూడో సెమిస్టర్ విద్యార్థులకు 13వ తేదీ సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమైనట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ జి.సోమశేఖర మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సోమశేఖర మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 42 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యూనివర్సిటీ అధికారులు 42 మంది అబ్జర్వర్లు, 3 స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేశామని, ఎలాంటి అవకతవకలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారన్నారు. ఎవరైనా మాల్ ప్రాక్టీసుకు పాల్పడితే డీబార్ చేస్తున్నామని తెలిపారు. 14వ తేదీ మంగళవారం గిద్దలూరు పరిధిలో జరిగిన పరీక్షలో మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను స్క్వాడ్ టీం డీబార్ చేశారన్నారు. తాను సీఎస్ఆర్ శర్మ కాలేజీ, శ్రీ నాగార్జున డిగ్రీ కాలేజీ సెంటర్లను పరిశీలించినట్లు చెప్పారు.

శానిటేషన్ పరిశీలించిన డీపీఓ



సంతనూతలపాడులో చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

సంతనూతలపాడు: మండల కేంద్రమైన సంతనూతలపాడులో మంగళవారం శానిటేషన్, ఓహెచ్ఎస్ఆర్, తాగునీటి ట్యాంకు, ఎస్ డబ్ల్యూపీసీ కేంద్రం, గార్బేజ్ కలెక్షన్, స్వామిత్వ సర్వేలను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు పరిశీలించారు. వాటర్ ట్యాంక్ వద్ద ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా వాటర్ టెస్టింగ్ చేయించారు. 15 రోజులకు ఒకసారి ఓహెచ్ ఎస్ఆర్ ట్యాంకును క్లీన్ చేయాలని డీపీఓ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు ట్యాంక్ పరిసరాలు పరిశుభ్రం చేయించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో డి.సురేష్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో పి.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్ మధుసూదన్‌రావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్ కుమార్, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ చక్రధర్, నియోజకవర్గ రిసోర్స్ పర్సన్ జయశంకర్, గ్రామపంచాయతీ ప్రతినిధులు బాబు రావు, శిఖామణి, పంచాయతీ శానిటేషన్ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

17న జాబ్ మేళా



జాబ్ మేళాకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ పీ.రాజా బాబు, ఇతర అధికారులు

ఒంగోలు సబర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఎస్ఎన్‌పాడు మండలంలోని ఎండ్లూరి డొంకలోని మహిళా ప్రాంగణంలో 'జాబ్ మేళా' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పీ.రాజా బాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం తన ఛాంబర్‌లో అందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో హెటిరో లాబ్స్, శ్రీ చక్ర హ్యుందాయ్, ఎంఆర్ఎఫ్, బ్రహ్మ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, భారత్ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం, పీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, తిరుమల ఆటోమోటివ్స్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 18 నుండి 35 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు తమ అర్హత ప్రకారం ఈ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు. బీటెక్, డిగ్రీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమా, పీజీ వంటి అర్హతలున్న అభ్యర్థులకు వివిధ రంగాల్లో అవకాశాలు లభించనున్నాయి. జిల్లా యువత తమ రిజిస్ట్రేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పూర్తి చేసుకోవాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లు: 99888 53335, 87126 55866, 87901 18349, 87901 17279 ఈ నంబర్లతో పాటు కార్యాలయంలో అందుబాటులో సంప్రదించవలసిన ఎస్.కె. బాషా: 99630 05209 ను కూడా సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి రమాదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజతో పాటు ఇతర ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు అండర్-19 జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపిక

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈనెల 16, 17వ తేదీల్లో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్ల ఎంపిక జరగనున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు కే ఆంజనేయులు, కార్యదర్శి ఇ చింపారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ ఉదయం 9 గంటలకు హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, 17వ తేదీ ఉదయం 9 గంటలకు కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీల్లో ఎంపికలు నిర్వహిస్తామని, ఇతర వివరాలకు కాలేజీ పీడీ కే శంకరరావు సెల్: 9848125706 ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఒంగోలు టౌన్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఫోర్‌వీలర్ ఆటో రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలు నగరంలోని పీర్లమాన్యం సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కరవది గ్రామానికి చెందిన సంగిశెట్టి వెంకటేశ్వర రావు(47) బైకుపై ఒంగోలు నుంచి పేర్నమిట్ట గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో రాంగ్ రూట్‌లో వచ్చిన ప్రైవేట్ స్కూల్‌కు చెందిన ఆటో ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి వెంకటేశ్వరరావు ఒక్కసారిగా గాలిలో ఎగిరి డివైడర్ అవతల పడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. తీవ్ర గాయాలపాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. తాలుకా ఎస్సై హరిబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి తరలివచ్చి కన్నీరుమున్నీరయ్యారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కనిగిరి రూరల్: ఎలుకల మందు తాగి ఒంగోలులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతి చెందాడు. వివరాలు.. కనిగిరి పట్టణానికి చెందిన ఎస్. పవన్ కుమార్(27) కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇంట్లో సమస్యల నేపథ్యంలో ఈనెల 5న కుటుంబ సభ్యులను బెదిరించేందుకు ఎలుకల మందు పేస్ట్ తాగాడు. మరుసటి రోజు గమనించిన కుటుంబ సభ్యులు ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తెల్లరాయి తరలిస్తున్న వాహనాలు సీజ్



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన జేసీబీ, టిప్పర్

పీసీపల్లి:

మండలంలోని తురకపల్లి గ్రామ పరిసరాల్లో అనుమతి లేకుండా తెల్లరాయి తవ్వకాలు సాగిస్తుండగా మంగళవారం మార్కాపురం మైనింగ్ ఏడీ శ్రీనివాసరెడ్డి తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. తెల్లరాయి వెలికితీసేందుకు డ్రిల్లింగ్ చేస్తున్న జేసీబీ, రాళ్లను తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్‌ను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

అటవీ భూముల్లో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేయగా దాడులు చేసినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న తెల్లరాయిని వీఆర్‌ఓ రఫీకి అప్పటించినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా అక్రమంగా తెల్లరాయి తవ్వి తరలిస్తుంటే సమాచారం ఇవ్వాలని కోరారు.

ఒక్క పనిముట్టు.. అందితే ఒట్టు!



- రబీ ప్రారంభమైనా రైతులకు అందని వ్యవసాయ పరికరాలు
- రోటోవేటర్లు, తైవాన్ స్ప్రేయర్ల కోసం ఎదురుచూపులు
- జిల్లాలో ఖరీఫ్‌లో 70 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటల సాగు
- పనిముట్లకు అద్దెలు చెల్లించలేక అవస్థలు పడిన రైతులు



ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి

మార్కాపురం:

కూటమి ప్రభుత్వ తీరు వ్యవసాయ రంగాన్ని క్రమంగా సంక్షభంలోకి నెడుతోంది. పంటలకు గిట్టుబాటు కల్పించడంలో, ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో ఘోరంగా విఫలమైన కూటమి ప్రభుత్వ పాలకులు.. అన్నదాతలకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు సకాలంలో అందించకుండా చోద్యం చూస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ వ్యవసాయ పనిముట్లు అందకపోవడంతో రైతులు అద్దెకు తెచ్చుకుని వాడుకోవాల్సిన దుస్థితి. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలో ఖరీఫ్‌లో 70 వేల హెక్టార్లలో రైతులు వరి, మొక్కజొన్న, కంది, జొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఆముదం, పత్తి, మిర్చి సాగు చేశారు. ఈ పంటల్లో తెగుళ్లను నివారించేందుకు తైవాన్ స్ప్రేయర్లు అవసరం. దీంతోపాటు రబీ సీజన్‌లో పొలాలు సాగు చేసుకునేందుకు, దుక్కులు దున్నుకునేందుకు మెయింటైన్ కల్టివేటర్ (ట్రాక్టరుతో నడిచే గొర్రు), నూరిడి యంత్రాలు, భూమ్ స్ప్రేయర్ (ట్రాక్టరుతో నడిపే స్ప్రేయరు), విత్తనాలు ఎద బెట్టే గొర్రులు రైతులకు అత్యవసరం. ఇవేవీ జిల్లా వ్యాప్తంగా రైతులకు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు వస్తాయో.. రావో.. కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో వ్యవసాయ డ్రోన్లను అందుబాటులోకి తెచ్చినా అవి కొన్ని మండలాలకే పరిమితం చేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్ ప్రారంభం కావడంతో మొక్కజొన్న, శనగ సాగు చేసుకునేందుకు, విత్తనాలు ఎద పెట్టుకునేందుకు, ట్రాక్టరుతో నడిచే గొర్రు అత్యవసరం. పత్తి, మిర్చి, వరి పంటల్లో తెగుళ్ల నివారణకు తైవాన్ స్ప్రేయర్లు అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది.

పెట్టుబడి మరింత భారం

పత్తి, మిర్చి పండిస్తున్న రైతులు లక్షల రూపాయల సొమ్మును పెట్టుబడి కోసం ఖర్చు చేస్తున్నారు. ఎకరా పత్తి సాగుకు రూ.25 వేల వరకు, మిర్చి సాగుకు లక్షన్నర రూపాయలకు పైగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పవర్ స్ప్రేయర్లు, ఇతర యంత్ర పరికరాలకు బాడుగలు చెల్లించాలంటే ఆర్థికంగా మరింత భారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పత్తి సుమారు 13 వేల హెక్టార్లలో, వరి 6 వేల హెక్టార్లలో, మొక్కజొన్న సుమారు 5వేల హెక్టార్లలో సాగుచేశారు. కాగా పత్తికి అక్కడక్కడా తామర పురుగు, పచ్చదోమ, మిర్చికి పై ముడత, వరికి ఆకుమచ్చ తెగులు ఆశించింది. వీటి నివారణకు మందులు పిచికారీ చేయాలంటే కచ్చితంగా తైవాన్ స్ప్రేయర్ అవసరం. సేద్యానికి అవసరమైన పనిముట్లతో తైవాన్ స్ప్రేయర్లు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన వ్యవసాయ పరికరాలు అందిస్తే రబీ సీజన్‌లో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.

అడవుల సంరక్షణకు ప్రాధాన్యం

- పర్యాటకాభివృద్ధి పైనా దృష్టి సారించాలి
- అటవీ, పర్యాటక శాఖలపై సమీక్షలో కలెక్టర్ రాజాబాబు



అటవీశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: అడవుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. వివిధ విభాగాల అటవీ శాఖ అధికారులతో, పర్యాటక శాఖ అధికారులతో మంగళవారం ఆయన ప్రకాశం భవన్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అడవుల సంరక్షణతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి పైనా దృష్టి సారించాలని అందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని జిల్లా యంత్రాంగం తరఫు నుంచి అందిస్తామన్నారు. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం, నగరవనాల అభివృద్ధి, రోడ్లు, మొబైల్ టవర్ల నిర్మాణాలు తదితర ప్రాజెక్టులకు అటవీశాఖ అనుమతులు, కోస్తా తీరం వెంట గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్ అభివృద్ధి, రెవెన్యూ రికార్డుల్లో రిజర్వ్ ఫారెస్ట్ భూముల వివరాల అప్‌డేషన్, మ్యుటేషన్, ఫారెస్ట్, వైల్డ్ లైఫ్ మేనేజ్మెంట్, అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, పర్యాటక అభివృద్ధి, స్థానికులకు జీవనోపాధి కల్పించేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి అటవీ శాఖల వివిధ విభాగాల నుంచి ఒకరిని ప్రత్యేకంగా కేటాయించాలని చెప్పారు. దీంతోపాటుగా ప్రతినెలా అటవీ భూముల పరిరక్షణకు అవసరమైన సంయుక్త సమావేశం, భూముల జాయింట్ సర్వే జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. జిల్లాలో రెండు విమానాశ్రయాలు రానున్నాయని, వచ్చే ఏడాది ఆగస్టు నాటికి వెలుగొండ ద్వారా నీళ్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ ఆలోచన అని కలెక్టర్ చెప్పారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రకాశం జిల్లా ముఖచిత్రమే మారిపోతుందన్నారు. హైదరాబాద్, అమరావతి, తిరుపతి, బెంగళూరుకు మధ్యలో ఉన్న ప్రాంతం కావడం, నల్లమల పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉండడం వల్ల భవిష్యత్తులో మంచి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వినోద్ కుమార్, డీఎఫ్‌వో(సోషల్ ఫారెస్ట్) రాజశేఖర్ రావు, గిద్దలూరు టైగర్ రిజర్వ్ డీడీ నిషాకుమారి, మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ మహమ్మద్ అబ్దుల్ రవూఫ్, జిల్లా ఇన్‌చార్జి పర్యాటక అధికారి రమ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు భద్రత కట్టుదిట్టం

- 16వ తేదీ ప్రధాని పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు
- శ్రీశైలం వెళ్లే వాహనాలు ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలో నిలిపివేత
- ఉదయం 9 నుంచి 2 గంటల వరకు ప్రయాణాలు నిషేధం
- కర్నూలు వెళ్లే వాహనాలు కుంట, గిద్దలూరు మీదుగా దారి మళ్లింపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

పెద్దదోర్నాల: ప్రధాని నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకాశం జిల్లా మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. ఈ నెల 16వ తేదీ ప్రధాని నరేంద్రమోదీ శ్రీశైలం పుణ్యక్షేత్రం పర్యటన నేపథ్యంలో చేపట్టబోయే భద్రతా ఏర్పాట్లపై సీఐ ప్రభాకర్‌రావు, ఎస్సై మహేష్‌లతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే వాహనాలను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండల కేంద్రంలోని మల్లికార్జున నగర్‌లోనే నిలిపేస్తామని తెలిపారు. దీంతో పాటు అదే రోజు ప్రధాని కర్నూలు పట్టణంలో పర్యటిస్తుండటంతో గుంటూరు, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను కుంట, గిద్దలూరు, నంద్యాల మీదుగా దారి మళ్లించనున్నట్లు తెలిపారు. భక్తులు, యాత్రికులు తమ ప్రయాణాలను కొద్ది గంటల పాటు వాయిదా వేసుకోవాలని, వీలుంటే రద్దు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు శ్రీశైలం వెళ్లే వాహనదారులు లైసెన్స్‌లతో పాటు వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తమ వాహనాల్లో కచ్చితంగా ఉంచుకోవాలన్నారు. లైసెన్సులు, ధ్రువీకరణ పత్రాలు లేని పక్షంలో శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. దీంతో పాటు నల్లమల అభయారణ్యంలో ప్రయాణించే యాత్రికులు తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయటం తీవ్రంగా పరిగణిస్తారన్నారు. అలా ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తే చలానాలు భారీగా ఉంటాయని హెచ్చరించారు.

శ్రీశైలం వెళ్లే యాత్రికులు, భక్తులు పోలీసుల నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. శ్రీశైలం వెళ్లే వాహనచోదకులు మద్యం తాగి వాహనాలు నడపటం నేరమని, అధికారులకు పట్టుబడితే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. నల్లమల అభయారణ్యంలో సుమారు 300 మంది సిబ్బందిలో భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

నేడు కొనకనమిట్లలో కోటి సంతకాల సేకరణ

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..
- హాజరుకానున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు

కొనకనమిట్ల: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, పీపీపీ విధానంలో నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా బుధవారం సాయంత్రం 3 గంటలకు మండల కేంద్రమైన కొనకనమిట్లలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోరా శంకర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో చేపట్టే కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు గల్లంతు



మెలిక ప్రసాద్(ఫైల్)



ప్రసాద్ భార్య కొండమ్మను ఓదారుస్తున్న బంధువులు

తాళ్లూరు: సాగర్ కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి గల్లంతయ్యాడు. ఈ సంఘటన తాళ్లూరు మండలంలోని వెలుగువారిపాలెం పంచాయితీ రెడ్డి సాగర్ ఓబీసీ కెనాల్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన మెలిక ప్రసాద్(40) తన భార్య కొండమ్మతో కలిసి చేపలు పడుతూ జీవనం సాగిస్తుంటాడు. రోజూమాదిరిగానే సాగర్ కాలువలో చేపలు పట్టేందుకు వల వేశబూరు. నీటిలో నుంచి వల బయటకు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వల కాలుకు చుట్టుకోవడంతో పట్టుతప్పి కాలువలో పడి గల్లంతయ్యాడు. మెలిక ప్రసాద్(40)కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రసాద్ మరణించి ఉంటాడని భావించిన కుటుంబ సభ్యులు తమ బంధువులతో కలిసి మృతదేహం కోసం గాలిస్తున్నారు.

డైవర్షన్ పాలిటిక్స్‌లో దిట్ట చంద్రబాబు

- మాజీ మంత్రి జోగి రమేష్‌ను అక్రమంగా కేసులో ఇరికిస్తున్నారు
- వైఎస్సార్ సీపీ బీసీ గౌడ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ బీసీ గౌడ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: నకిలీ మద్యం కేసులో అసలు దొంగలను తప్పించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరదీయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ బీసీ గౌడ నాయకుడు తాతా నరశింహ గౌడ్ ధ్వజమెత్తారు. మాజీ మంత్రి జోగి రమేష్‌ను అక్రమంగా కేసులో ఇరికిస్తున్నారని మండిపడ్డారు. ఒంగోలులోని బొట్ల సుబ్బారావు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నారా వారి నకిలీ మద్యం కూటమి ప్రభుత్వంలో ఏరులై పారుతోందని ఎద్దేవా చేశారు. నకిలీ మద్యం విక్రయించి ప్రజా ధనం దోచుకుంటూ అడ్డంగా దొరికిన టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి, జనార్దన్‌రావు, సురేంద్ర నాయుడు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఈ కేసుతో లింకులు ఉన్న టీడీపీ ముఠాను తప్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పక్కాగా స్కెచ్ వేశారని, గౌడ సామాజికవర్గానికి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్‌పై అక్రమ కేసు నమోదు అందులో భాగమేనని ఆరోపించారు. ఈ కుట్రలో అసలు సూత్రదారులు చంద్రబాబు, లోకేష్ కాగా, పాత్రధారులు జయచంద్రారెడ్డి, జనార్ధన్ అని చెప్పారు. ప్రజల ప్రాణాలను బలిగొంటున్న నకిలీ మద్యం మకిలిని వైఎస్సార్ సీపీ అంటించాలని సాగిస్తున్న కుట్రలు భగ్నం కాక తప్పదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కల్లుగీత కార్మికులు, గౌడ సంఘీయులను సంఘటితం చేసి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గత 17 నెలలుగా ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుడితే.. కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు నిర్ణయించడం బడుగుబలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం చేసేందుకేనని విమర్శించారు. ఒక పక్క మట్టి, ఇసుక, లిక్కర్ సిండికేట్లతో రాష్ట్రాన్ని దోచుకుంటున్న కూటమి ముఠాలు.. అది చాలదన్నట్లు నకిలీ మద్యంతో రూ.వేల కోట్లు పోగేసుకున్నాయని ధ్వజమెత్తారు. నకిలీ మద్యం కేసును తప్పుదారి పట్టించేందుకు జోగి రమేష్‌పై అక్రమ కేసులు బనాయించడం అవివేకమన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ చేయడం చంద్రబాబు దిట్ట అని మండిపడ్డారు. నకిలీ మద్యంతో పేద ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, తక్షణమే జోగి రమేష్ గౌడ్ మీద అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు తాతా నాంచార్లు గౌడ్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫణిదపు సుధాకర్, కొత్తపట్నం మండలం బీసీ సెల్ అధ్యక్షుడు తుళ్లూరి వెంకట నారాయణ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు 38వ డివిజన్ పాలడుగు శ్రీనివాసరావు, 15వ డివిజన్ నాయకుడు వీసం బాలకష్ణ, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఉసురు తీసిన ఈత సరదా



ఆసిఫ్(ఫైల్)



ఆసిఫ్‌ను నీటిలో నుంచి బయటకు తీసిన స్థానికులు

గిద్దలూరు రూరల్: ఈతకు వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన గిద్దలూరు మండలంలోని కొండపేట గ్రామ సమీపంలో గల ఆంజనేయ స్వామి గుడి వెనుక సగిలేరు వాగులో మంగళవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సయ్యద్ ఆసిఫ్(22) స్నేహితులతో కలిసి సగిలేరు వాగులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో వాగు లోతట్టు ప్రాంతంలోకి వెళ్లిన ఆసిఫ్ ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. స్నేహితులు గమనించి అతడిని రక్షించేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. నీటిలో మునిగిపోయిన ఆసిఫ్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ కె.సురేష్ తమ సిబ్బందితో కలిసి వాగు వద్దకు చేరుకున్నారు. స్థానికుల సహాయంతో ఆసిఫ్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం పోలీస్ వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఆసిఫ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. యువకుడి మృతిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆసిఫ్ తండ్రి రసూల్ అటవీశాఖలో కాంట్రాక్ట్‌బేస్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియెట్ వరకు చదివిన ఆసిఫ్ ఇంటి వద్దనే ఉంటున్నాడు.

చిట్‌ఫండ్ సిబ్బంది వేధింపులు తాళలేక ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

ఒంగోలు టౌన్: ప్రైవేట్ చిట్‌ఫండ్ కంపెనీ సిబ్బంది వేధింపులు తాళలేక ప్రభుత్వ ఉద్యోగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. ఒంగోలు నగరంలోని సంతపేటలో నివాసం ఉండే కోమటిగుంట శ్రీనివాసులు(35) ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆయన ఒక ప్రైవేట్ చిట్‌ఫండ్ కంపెనీలో చీటీ వేశారు. కొంతకాలం సక్రమంగా నగదు వాయిదాలు చెల్లించిన శ్రీనివాసులు ఆర్థిక ఇబ్బందులతో మిగతా డబ్బు కట్టలేకపోయాడు. దీంతో సదరు చిట్‌ఫండ్ కంపెనీ సిబ్బంది ఒత్తిడి చేయడం ప్రారంభించారు. చీటీ తాలుకు డబ్బు కట్టాలని నోటికొచ్చినట్లు మాట్లాడి వేధించడంతో మనోవేదనకు గురైన ఆయన ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యా ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వేర్వేరు ఘర్షణల్లో 24 మందిపై కేసు నమోదు

కొమరోలు: మండలంలో 2 గ్రామాల్లో మంగళవారం చోటుచేసుకున్న వేర్వేరు ఘర్షణల్లో మొత్తం 24 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. మండలంలోని గోహరపల్లె గ్రామంలోటేపీరికార్డు సౌండ్ అధికంగా పెట్టారన్న విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తగా 16 మందిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే మండలంలోని అక్కపల్లె గ్రామంలో పొలం, స్థలం వివాదం నేపథ్యంలో 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఫైనాన్స్ కంపెనీకి తాళం

- సంస్థ సిబ్బందిపై ఓ కస్టమర్ ఆగ్రహం
- సమాచారం లేకుండా బంగారం వేలం వేశారని ఆరోపణ

యర్రగొండపాలెం: స్థానిక మార్కాపురం రోడ్డులోని ఆశీర్వాద్ గోల్డ్ లోన్ కార్యాలయానికి ఓ కస్టమర్ తాళాలు వేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న చేవూరి రాజశేఖర్ సదరు ఫైనాన్స్ కంపెనీలో విడతలవారీగా 101 గ్రాముల బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టాడు. వాటిని విడిపించుకోవడానికి వెళ్లగా వేలం వేశామని ఆ కంపెనీ సిబ్బంది సమాధానమిచ్చారు. తనకు గత 6 నెలలుగా తగిన సమాధానం ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకోవడంతోపాటు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తన ఆభరణాలను వేలం వేశారని రాజశేఖర్ ఆరోపించాడు. మంగళవారం సంస్థ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ కార్యాలయానికి తాళం వేశాడు. కాగా ఫైనాన్స్ సంస్థ కార్యాలయానికి వేసిన తాళాలను తొలగించి, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.చౌదయ్య తెలిపారు.

ఒంగోలులో నకిలీ బీరు కలకలం

- కొప్పోలు బ్రిడ్జి వద్ద ఒకవైన్ షాపులో నకిలీ బీరు
- ఎక్సైజ్ సురక్ష యాప్‌లో ఎర్రర్ రావడంతో నకిలీ బీరుగా గుర్తించిన స్థానికులు



బీర్ బాటిల్‌పై క్యూ ఆర్ కోడ్‌ను స్కానింగ్ చేయగా వచ్చిన ఎర్రర్ మెసేజ్

ఒంగోలు టౌన్: నగరంలో నకిలీ బీరు బాటిల్ కలకలం సృష్టించింది. నగర శివారులోని కొప్పోలులో జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఒక వైన్ షాపులో మంగళవారం ఒక కస్టమర్ మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అనుమానం వచ్చిన అతడు ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ డౌన్లోడ్ చేసుకొని పరీక్షించాడు. తొలుత మాన్షన్ హౌస్ లిక్కర్ తీసుకొని క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయగా మద్యం బాటిల్ వివరాలు వచ్చాయి. ఆ తరువాత బీర్ బాటిల్ మీద ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేశాడు. ఎర్రర్ అని వచ్చింది. ఈ మొత్తం వ్యవహారాన్ని వీడియో తీసిన సదరు కస్టమర్ ఒంగోలులోని వైన్ షాపుల్లో నకిలీ బీర్ విక్రయిస్తున్నారని, మందుబాబులు జాగ్రత్తగా ఉండాలని సోషల్ మీడియాలో పెట్టాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ అయింది. నకిలీ బీరు తాగుతున్నామంటూ మందు బాబులు ఆందోళనకు గురయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌లో కేవలం నకిలీ లిక్కర్‌ను మాత్రమే గుర్తించే సౌకర్యం ఉందని, బీరు బాటిళ్లను గుర్తించే సౌకర్యం లేదని ఎక్సైజ్ ఈఎస్ షేక్ ఆయేషా బేగం తెలిపారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను కేవలం లిక్కర్ బాటిళ్ల స్కానింగ్‌కు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. బీరు బాటిళ్ల మీద కంపెనీకి చెందిన క్యూఆర్ కోడ్ మాత్రమే ఉంటుందని, ప్రభుత్వ యాప్‌కు దీనికి సంబంధం లేదని స్పష్టం చేశారు.